జనాభా సంక్షోభం!

- భారత్‌లో వేగంగా తగ్గుతున్న సంతానోత్పత్తి రేటు
- 2050 నాటికి 1.29కు తగ్గనున్న ఫెర్టిలిటీ రేట్
- ఇప్పుడు జపాన్ పరిస్థితే 30 ఏండ్ల తర్వాత మనకూ..
- దేశంలో భారీగా పెరిగిపోనున్న వృద్ధుల జనాభా

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: ప్రపంచంలోనే ఎక్కువ యువత ఉన్న దేశం మనదని గొప్పగా చెప్పుకుంటాం. 'యువ భారతం'గా మన దేశాన్ని పిలుచుకుంటాం. ఒళ్లొంచి పని చేసే యువ జనాభా ఎక్కువగా ఉండటమే భారత్ బలం. అయితే, ఈ బలం భవిష్యత్తులో ఉండ కపోవచ్చు. ఇప్పటి 'యువ భారతం' మూడు దశాబ్దాల తరువాత 'వృద్ధ భారతం'గా మార బోతున్నది. జనాభా రేటు తగ్గిపోయి, వృద్ధుల జనాభా పెరగడం వల్ల ఇప్పుడు జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు సంక్షోభంలో కూరుకు పోతున్నాయి. ఆ దేశాల అభివృద్ధికి ఇది అడ్డం కిగా మారుతున్నది. ఇదే పరిస్థితి 30 ఏండ్ల తర్వాత మన దేశానికీ ఎదురుకాబోతున్నది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉండనుంది.

భారీగా పడిపోయిన సంతానోత్పత్తి రేటు

ఒక మహిళ 15 ఏండ్ల నుంచి 49 ఏండ్ల మధ్య వయసులో జన్మనిచ్చే పిల్లల సంఖ్య సగటును సంతానోత్పత్తి రేటుగా లెక్కిస్తారు. 1950లో దేశంలో సంతానోత్పత్తి రేటు 6.18గా ఉండేది. అధిక జనాభా కారణంగా ఆహార కొరత వంటి సమస్యలు తలెత్తడంతో 1951 నుంచి కుటుంబ నియంత్రణ కార్యక్ర మాన్ని అమలు చేశారు. ఇద్దరిని మించి కనవ ద్దని అవగాహన కల్పించారు. దీంతో క్రమంగా సంతానోత్పత్తి రేటు తగ్గుతూ వచ్చింది. ఈ తగ్గుదల మరీ ఎక్కువ కావడమే ఇప్పుడు సమస్యగా మారింది. జనాభా తగ్గొద్దంటే సంతానోత్పత్తి 2.1గా ఉండాలి. మన దేశంలో సంతానోత్పత్తి రేటు వేగంగా ఈ రీప్లేస్‌మెంట్ స్థాయికి దిగువకు పడిపోతున్నది. దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 31లో సంతాన రేటు 2.1కు, అంతకు దిగువకు పడి పోయింది. బీహార్, యూపీ, జార్ఖండ్, మేఘా లయ, మణిపూర్ మాత్రమే ఎగువన ఉన్నాయి. 2019-21కి దేశంలో సంతానో త్పత్తి రేటు 2.0తో రీప్లేస్‌మెంట్ స్థాయికి దిగు వకు తగ్గినట్టు కేంద్రం వెల్లడించింది.

తేరుకోకపోతే సంక్షోభమే

భారత్‌లో సంతానోత్పత్తి ఇలాగే కొనసాగితే 2050 నాటికి 1.29కు పడిపోతుందని ఇటీ వల లాన్సెట్ జరిపిన ఒక అధ్యయనంలో తేలింది. అంటే, మరో మూడు దశాబ్దాల్లో దేశంలో వృద్ధుల జనాభా భారీగా పెరగడంతో పాటు మొత్తం జనాభా సంఖ్య తగ్గిపోనున్నది. ఇదే జరిగితే దేశానికి బలంగా ఉన్న శ్రామిక శక్తి తగ్గిపోయి ఆర్థిక వృద్ధి కుంటుపడుతుంది. వృద్ధుల జనాభా పెరగడం వైద్య సేవలు, పింఛన్ల వ్యవస్థపై భారం పెంచుతుంది. కాగా, జీవన వ్యయం పెరిగిపోవడం వల్ల ఒకరిని మించి పిల్లలను కనేందుకు యువ దంప తులు వెనకాడటం సంతానోత్పత్తి రేటు తగ్గ డానికి ప్రధాన కారణం. వివాహాలు ఆల స్యంగా చేసుకుంటుండటం, మానసిక ఒత్తిడి, జీవనశైలి, వాతావరణ సంబంధ సమస్యల వల్ల వంధ్యత్వం పెరగడం కూడా కారణమే. భారత్‌లో ఇప్పటికీ యువ జనాభా ఎక్కువ కాబట్టి వెంటనే అప్రమత్తమైతే భవిష్యత్తులో తలెత్తే సంక్షోభాన్ని నివారించవచ్చని నిపు ణులు సూచిస్తున్నారు.

మే 18న జేఈఈ అడ్వాన్స్‌డ్ ఎగ్జామ్

షెడ్యూల్‌ను విడుదల చేసిన ఐఐటీ కాన్పూర్

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఇండియన్ ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)ల్లో నాలుగేండ్ల బీటెక్ సీట్ల భర్తీకి నిర్వ హించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష షెడ్యూల్ విడుదలైంది. ఈ పరీ క్షను జాతీయంగా 2025 మే 18న నిర్వహించనున్నట్టు ఐఐటీ కాన్పూర్ తెలిసింది. అడ్వాన్స్‌డ్ పరీక్షలో రెండు పేపర్లుంటాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్-2కు పరీక్షను నిర్వహిస్తారు. అభ్యర్థులు రెండు పేపర్లకు హాజరవడం తప్పనిసరి. ఇప్పటికే జేఈఈ మెయిన్స్ పరీక్షల షెడ్యూల్స్ విడుదలయ్యాయి. దేశ వ్యాప్తంగా 23 ఐఐటీలుండగా, వీటిల్లో 17,740 బీటెక్ సీట్లు న్నాయి.

ఆక్స్‌ఫర్డ్ 'వర్డ్ ఆఫ్ ది ఇయర్-2024'గా 'బ్రెయిన్ రాట్'

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ 'వర్డ్ ఆఫ్ ది ఇయర్-2024'గా బ్రెయిన్ రాట్(brain rot)ను ప్రకటిం చింది. 37 వేల మందికిపైగా పాల్గొన్న పబ్లిక్ ఓటింగ్ నుంచి ఆరు పదాలను షార్ట్ లిస్ట్ చేసి అందులో నుంచి బ్రెయిన్ రాట్‌ను వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపిక చేశారు. బుద్ధి హీనమైన సోషల్ మీడియా అలవాట్లు, నిష్ప్రయోజ నకర కంటెంట్ వినియోగంపై విస్తృత ఆందోళనలను దృష్టిలో ఉంచుకొని ఈ పదాన్ని ఈ ఏడాది పదంగా ఎంపిక చేశారు. మానసిక లేదా మేధో స్థితి క్షీణతను బ్రెయిన్ రాట్ అంటారు. అవసరం లేని కంటెంట్‌ను అధికంగా వినియోగిం చడం వల్ల ఇది కలుగుతుంది. ముఖ్యంగా సామాజిక మాధ్య మాల్లో తక్కువ నాణ్యత గల ఆన్ లైన్ కంటెంట్‌తో ఎక్కువగా మమేకం అయినప్పుడు కలిగే దుష్ప్రభావాలపై ఏడాది కాలంగా ఈ పదం విస్తృతంగా వాడుకలోకి వచ్చింది.

తమ డిమాండ్ల సాధన కోసం సోమవారం నోయిడాలో బారికేడ్లను ఛేదించుకొని ముందుకెళ్తున్న అన్నదాతలు

రైతుల 'ఢిల్లీ చలో'

- పార్లమెంటుకు భారీ ర్యాలీ తలపెట్టిన రైతు సంఘాలు
- నోయిడాలో అడ్డుకున్న పోలీసులు.. భారీగా ట్రాఫిక్ జామ్
- సమస్యల పరిష్కారానికి కేంద్రానికి వారం గడువిచ్చిన రైతులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: తమ డిమాండ్ల పరి ష్కారానికి నోయిడా రైతులు మరోసారి ఉద్య మబాట పట్టారు. పార్లమెంటు సమావేశాల వేళ 'ఢిల్లీ చలో' కార్యక్రమాన్ని తలపెట్టారు. ప్రభుత్వం సేకరించిన తమ భూములకు పరిహారం పెంచాలని, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ భార తీయ కిసాన్ పరిషత్(బీకేపీ), కిసాన్ మజ్దూర్ మోర్చా(కేఎంఎం), సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) వంటి రైతు సంఘాలు ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చాయి. ఉత్తరప్రదేశ్‌లోని 20 జిల్లాల నుంచి తరలివచ్చిన రైతులతో సోమవారం ఉదయం నోయిడాలోని మహామయ ఫ్లైఓవర్ నుంచి ర్యాలీ ప్రారంభమైంది. ట్రాక్టర్లలో, పాదయా త్రగా పెద్ద సంఖ్యలో అన్నదాతలు ర్యాలీకి బయలుదేరారు. ఢిల్లీలోకి ప్రవేశించకుండా నోయిడాలోని దళిత్ ప్రేరణ స్థల్(అంబేద్కర్ పార్కు) వద్ద పోలీసులు, ఆర్ఏఎఫ్ బల గాలు.. రైతులను అడ్డుకున్నాయి. బ్యారికేడ్లు దాటేందుకు రైతులు ప్రయత్నించడంతో స్వల్ప ఉద్రిక్తతలు తలెత్తాయి. రైతులతో చర్చలు జరిపిన అధికారులు.. సమస్యల పరి ష్కారానికి వారం పాటు సమయం కోరారు. వారంలో సమస్యలు పరిష్కరించకపోతే మళ్లీ 'ఢిల్లీ చలో' నిర్వహిస్తామని, అప్పటివరకు దళిత్ ప్రేరణ స్థల్‌లోనే ఉంటామని ఎస్‌కేఎం ప్రకటించింది. రైతుల ర్యాలీ, పోలీసులు భద్రతా చర్యల కారణంగా యమునా ఎక్స్‌ప్రె స్‌వేపై గంటల తరబడి కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోయింది.

2026 చివరిలో గగన్‌యాన్

గువాహటి: మన దేశపు తొలి మానవ సహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్ మిషన్ ప్రయోగం 2026 చివర్లో జరు గుతుందని ఇస్రో చైర్మన్ ఎస్ సోమ నాథ్ చెప్పారు. వచ్చే ఏడాది ప్రారం భంలో ఈ రాకెట్ మానవ రహిత ప్రయోగం జరుగుతుందన్నారు. ఐఐటీ గువాహటిలో సోమవారం జరిగిన కార్యక్రమానికి హాజరైన సోమనాథ్ విలేకర్లతో మాట్లాడారు. గగన్‌యాన్ ప్రాజెక్టు కోసం నాలుగేళ్ల నుంచి కృషి చేస్తున్నామని చెప్పారు. మానవ రహిత రాకెట్ ప్రయోగంలో భాగంగా దానిలో వ్యోమమిత్ర అనే రోబోను ఉంచుతా మని తెలిపారు.

భూమి కంటే చంద్రుడే 'స్పీడ్'

చందమామపై వేగంగా గడుస్తున్న సమయం

న్యూయార్క్: భూమితో పోల్చినప్పుడు చంద్రుడిపై సమయం వేగంగా గడుస్తున్నదని అమెరికా శాస్త్రవేత్తలు చెప్తున్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్టాండర్డ్స్ అండ్ టెక్నాలజీ భౌతిక శాస్త్రవేత్తలు బిజునాథ్ పట్ల, నీల్ అష్బీ చంద్రుడిపై సమయాన్ని గుర్తించేందుకు ఒక అధ్యయనం జరిపారు. ఐన్‌స్టీన్ ప్రతిపాదించిన సాధా రణ సాపేక్ష సిద్ధాంతం ఆధారంగా జరిగిన ఈ స్టడీ వివరాలు 'ఆస్ట్రోనామికల్ జర్నల్'లో ప్రచురితమయ్యాయి. సాధారణ సాపేక్ష సిద్ధాంతం ప్రకారం ప్రామాణిక గడియారం రేటు దాని స్థానంలో ఉన్న గురుత్వాకర్షణ, సాపేక్ష చలనం ద్వారా ప్రభావితమవుతుంది. ఈ లెక్కన భూమి కంటే చంద్రుడి గురుత్వాకర్షణ శక్తి తక్కువగా ఉన్నందున చంద్రుడిపై కాలం వేగంగా గడుస్తున్నదని వీరు తేల్చారు. భూమితో పోలిస్తే చంద్రుడిపై రోజుకు 56 మైక్రో సెకన్లు వేగంగా గడియారం నడుస్తున్నట్టు పేర్కొన్నారు. తమ అధ్యయనం కోఆర్డినేటెడ్ లూనార్ టైమ్‌ను ఏర్పాటు చేసేందుకు వీలు కల్పిస్తుందన్నారు. 56 మైక్రో సెకన్లు చిన్న విషయమైనా, చంద్రుడిపైకి ప్రయోగాలు జరిపేందుకు కీలకమైన నావిగేషన్ విషయంలో చాలా ముఖ్యమైనదని చెప్పారు.

భారత్ నుంచి తొలి దేశీయ యాంటీబయాటిక్

- త్వరలో అందుబాటులోకి 'నఫిత్రోమైసిన్'
- ఔషధ నిరోధక నిమోనియాకు విరుగుడు

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: ఔషధాలకు లొంగని వ్యాధి కారకాల పని పట్టించే యాంటీబయాటిక్ 'నఫిత్రోమై సిన్'ను భారత్ తయారుచేసింది. కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీలో భాగమైన బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రిసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్(బీ ఐఆర్ఏసీ) ఈ ఔషధాన్ని అభివృద్ధి చేసింది. భారత్‌లో దేశీయంగా అభివృద్ధి చేసిన మొట్ట మొదటి యాంటీబయాటిక్ ఇది. ఔషధాలకు లొంగని కమ్యూనిటీ - అక్వైర్డ్ బ్యాక్టీరియల్ నిమోనియా(సీఏబీపీ) చికిత్స కోసం పెద్దలకు ఈ ఔషధాన్ని వినియోగిస్తారు. ఇప్పుడు నిమోనియా చికిత్సకు ఎక్కువగా అజిత్రోమైసిన్ వాడుతున్నారు. అయితే, వ్యాధికారకాలు ఔషధ నిరోధక శక్తిని పెంచుకుంటుండటంతో చాలామంది రోగుల్లో అజిత్రోమైసిన్ సరిగ్గా పని చేయడం లేదు. దీనికి ప్రత్యామ్నాయంగా నిమోనియా చికిత్సకు నఫిత్రోమైసిన్ సమ ర్థంగా పని చేస్తున్నది. రూ.500 కోట్ల పెట్టుబడితో 14 ఏండ్ల పరిశోధన ద్వారా ఈ ఔష ధాన్ని తయారుచేశారు. త్వరలో 'మిక్నాఫ్' పేరుతో ముంబైకు చెందిన ఫార్మా కంపెనీ వొల్కార్డ్ట ఈ ఔషధాన్ని మార్కెట్‌లోకి తీసుకురానున్నది.

హై రిస్క్ ఫుడ్ క్యాటగిరిలో వాటర్ బాటిల్స్

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: ప్లాస్టిక్ క్యాన్స్, బాటిల్స్‌లో అమ్మే ప్యాకేజ్డ్ డ్రింకింగ్, మినరల్ వాటర్‌ను 'హై-రిస్క్ ఫుడ్' క్యాటగిరిలో చేర్చుతూ ఎఫ్ఎస్ఎస్ఏఐ(భారత ఆహార భద్రత, ప్రమాణాల నియంత్రణ సంస్థ) కొత్త నిబంధనలను ప్రవేశపెట్టింది. హై-రిస్క్ క్యాటగిరిలో చేర్చటం ద్వారా ప్యాకేజ్డ్ డ్రింకింగ్, మిన రల్ వాటర్ భద్రత, నాణ్యత ప్రమా ణాలు మెరుగుపడతాయని సంబంధిత వర్గాలు భావిస్తున్నాయి. హై-రిస్క్ క్యాటగిరిలోని ఉత్పత్తుల భద్రత, నాణ్యత ప్రమాణాల మెరుగుదల కోసం తప్పనిసరిగా తనిఖీలు చేయాల్సి ఉంటుంది. ప్రతి ఏటా తనిఖీలు నిర్వ హించి లైసెన్స్ రెన్యువల్ చేస్తారు.

'బెయిల్ దశలోనే నేర విచారణ వద్దు'

న్యూఢిల్లీ: క్రిమినల్ కేసుల్లో బెయిలు దశలోనే సాక్ష్యాధారాలను పరిశీలించి, నిందితుడి దోషిత్వం లేదా నిర్దోషిత్వం గురించి నిర్ణయిం చరాదని హైకోర్టులకు సుప్రీంకోర్టు చెప్పింది. గత ఏడాది జరిగిన హత్య కేసులో నిందితుడు అమిత్ కుమార్ బెయిల్ కోసం అలహా బాద్ హైకోర్టును ఆశ్రయించాడు. హైకోర్టు వాస్తవాలను పరిశీలించి నట్లు చెప్తూ, మే 27న బెయిలు మంజూరు చేసింది. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టు సోమవారం రద్దు చేసింది. మళ్లీ విచారణ జరపాలని హైకోర్టును ఆదేశించింది.

తనయుడికి బైడెన్ క్షమాభిక్ష

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష పదవి నుంచి త్వరలో దిగిపోనున్న జో బైడెన్.. తన కుమారుడు హంటర్ బైడెన్‌కు క్షమాభిక్ష ప్రసాదిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. అక్రమ ఆయుధ కొనుగోలు, పన్ను ఎగవే తకు సంబంధించిన కేసుల్లో హంటర్ దోషి అని ఈ ఏడాది ప్రారంభంలో నిర్ధారణ అయింది. ఆయన కాలిఫోర్నియాలోని డెలా న్‌లో త్వరలో హాజరుకావలసి ఉంది. ఆయనకు జైలు శిక్ష పడే అవ కాశం ఉంది. ఈ విచారణ ప్రక్రి యలో రాజకీయాలు జరిగాయని జో బైడెన్ పేర్కొన్నారు. కాగా, బైడెన్ నిర్ణయాన్ని కాబోయే అధ్య క్షుడు ట్రంప్ తప్పుబట్టారు. ఇది న్యాయవిరుద్ధమని అన్నారు.

వియ్యంకుడికి ట్రంప్ కీలక పదవి

వాషింగ్టన్: అమెరికన్ ప్రెసిడెంట్ ఎలక్ట్ డొనాల్డ్ ట్రంప్ తన వియ్యం కుడికి కీలక పదవి అప్పగించారు. పశ్చిమాసియా వ్యవహారాల సలహా దారుగా మస్సద్ బౌలోస్‌ను ఎంపిక చేసుకున్నారు. బౌలోస్ లెబ నీస్-అమెరికన్ వ్యాపారవేత్త. ఆయన కుటుంబ సభ్యులకు నైజీ రియా, లెబనాన్‌లలో వ్యాపారాలు ఉన్నాయి. ట్రంప్ చిన్న కుమార్తె టిఫ్ఫనీని బౌలోస్ కుమారుడు మైఖేల్ వివాహం చేసుకున్నారు. ట్రంప్ శనివారం చార్లెస్ కుష్నర్‌ను ఫ్రాన్స్ రాయబారిగా ఎంపిక చేసు కున్నారు. ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్‌కు తండ్రి చార్లెస్ కుష్నర్.

ఫెంగల్ తుఫాను తమిళనాడును వణికిస్తున్నది. భారీ వర్షాల కారణంగా జనజీవనం స్తంభించింది. నదులు, చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. వరద ప్రవాహం ధాటికి కృష్ణగిరి జిల్లాలోని ఉతన్‌గరజ్‌లో కొన్ని వాహనాలు ఇలా కొట్టుకు పోయాయి.

ఏ ఒక్క ఓటరునూ మినహాయించరాదు

'పిల్'పై ఈసీకి సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ: పోలింగ్ కేంద్రంలో గరిష్ట ఓటర్ల సంఖ్యను 1,200 నుంచి 1,500కు పెంచ టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరు పుతూ సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఏ ఒక్క ఓటరునూ మినహాయించరాదని సీజేఐ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం ఈసీకి స్పష్టం చేసింది. శాస్త్రీయమైన డాటాను పరిగణనలోకి తీసుకోకుండా పోలింగ్ కేంద్రంలో గరిష్ట ఓటర్ల సంఖ్యను ఈసీ పెంచిందని 'పిల్' తప్పుబట్టింది. దీనిపై మూడు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేస్తా మని ఈసీ తరపు న్యాయవాది సుప్రీంకో ర్టుకు తెలిపారు.

బెయిల్ వచ్చిన మరుసటి రోజే మంత్రి పదవా?

డీఎంకే నేత సెంథిల్ బాలాజీ కేసులో సుప్రీంకోర్టు ఆశ్చర్యం



న్యూఢిల్లీ, డిసెంబర్ 2: అవినీతి కేసులో బెయిల్‌పై విడుదలైన డీఎంకే నేత సెంథిల్ బాలాజీ.. కొద్ది గంటల్లోనే తమిళనాడు ప్రభు త్వంలో మళ్లీ మంత్రిగా బాధ్యతలు చేపట్ట డంపై సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. అసలు అక్కడ ఏం జరుగుతున్నదని ప్రశ్నిం చింది. ఈ కేసులో సాక్షులందరూ కచ్చితంగా ప్రభావితమవుతారన్న సందేహాలు అందరి లోనూ కలుగుతాయని సుప్రీంకోర్టు అభిప్రా యపడింది. సెంథిల్ బాలాజీకి బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు ఇచ్చిన తీర్పును రీకాల్ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారిస్తూ, పై వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో తదుపరి విచా రణను ఈ నెల 13కు వాయిదా వేసింది. 'అ తడి బెయిల్ రద్దు చేయటం గురించి మళ్లీ విచారణ జరిపేది లేదు. కానీ సాక్షులు ప్రభా వితం అవుతారన్నది పరిగణలోకి తీసుకొని, మళ్లీ విచారణ జరుపుతాం' అని ధర్మాసనం పేర్కొన్నది. 49 ఏండ్ల సెంథిల్ బాలాజీ నాలు గుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2011-2015లో రవాణా మంత్రిగా పనిచేసిన అత డిపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో సెప్టెంబర్‌లో బెయిల్ లభించిన మరు సటి రోజే స్టాలిన్ సర్కార్‌లో మంత్రిగా ప్రమా ణస్వీకారం చేశారు.

తొలగని మహా పీటముడి

- మహాయుతి కూటమి సమావేశం మళ్లీ రద్దు
- ఏక్‌నాథ్ షిండే కినుకతో ప్రభుత్వ ఏర్పాటు ఆలస్యం!
- రేపు కొత్త ముఖ్యమంత్రిని ప్రకటించే అవకాశం
- పరిశీలకులుగా నిర్మలా సీతారామన్, రూపానీ

ముంబై, డిసెంబర్ 2(నమస్తే తెలం గాణ): మహారాష్ట్ర కాబోయే సీఎం ఎవ రన్న సస్పెన్స్ ఇంకా కొనసాగుతున్నది. దీనికి డిసెంబర్ 4న ముగింపు పలుకుతు న్నట్టు బీజేపీ వర్గాలు సోమవారం ప్రక టించాయి. బుధవారం విధాన్ భవన్‌లో బీజేపీ శాసనసభ పక్షం 'కొత్త' నాయ కుడ్ని ఎన్నుకుంటుందని ఆ పార్టీ సీని యర్ నాయకుడు ఒకరు తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ అధిష్టానం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల, గుజరాత్ మాజీ సీఎం రూపానీలను పరిశీలకులుగా పంపింది. సమావేశం అనంతరం పార్టీ శాసనసభ నాయకుడి పేరును పరిశీల కులు అధికారికంగా ప్రకటించనున్నారు. కాగా, సీఎం పదవికి ఫడ్నవీస్ పేరును బీజేపీ ఖరారు చేసిందని, అధికారిక ప్రక టన మాత్రమే మిగిలి ఉందని విశ్వస నీయ వర్గాల సమాచారం. ఇదిలా ఉండగా, మంత్రివర్గ కూర్పుపై చర్చించేం దుకు సోమవారం ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ ఢిల్లీ వెళ్లారు. ఫడ్నవీస్ కూడా ఢిల్లీకి వెళ్తున్నారని తెలిసింది. ఆపద్ధర్మ సీఎం ఏక్‌నాథ్ షిండే లేకుండా అమిత్ షా ఈ సమావేశం నిర్వహించటం గమ నార్హం. వాస్తవానికి సోమవారం మహా యుతి కూటమి సమావేశమై, కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకోవాల్సి ఉన్నప్ప టికీ, ఆరోగ్య కారణాలతో షిండే అందు బాటులో లేకపోవడంతో రద్దయింది.

కొత్త సర్కార్‌పై షిండే కినుకు!

గురువారం సాయంత్ర 5 గంటలకు ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో జరిగే కొత్త సర్కార్ ప్రమాణ స్వీకార కార్యక్ర మానికి ప్రధాని నరేంద్ర మోదీ సహ బీజేపీ నాయకులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకాబోతు న్నారు. మరోవైపు మహాయుతి కూట మిలో ఆపద్ధర్మ సీఎం ఏక్‌నాథ్ షిండే వ్యక్తం చేస్తున్న మాటలు సంచలనం రేపు తున్నాయి. రెండోసారి సీఎంగా కొనసా గించటం లేదంటూ ఆయన కినుకు వహించారు. దీంతో ఆయన తీరుపై బీజేపీ అధిష్టానం కొంత కలవరపాటుకు గురవుతున్నది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో, 'నేను సామా న్యుల కోసం పని చేస్తున్నా. నేను ప్రజల ముఖ్యమంత్రిని. అందుకే నన్ను ముఖ్య మంత్రిని చేయాలని ప్రజలు కోరుకుంటు న్నారు' అంటూ షిండే వాపోయారు.

పార్లమెంటు ప్రతిష్టంభనకు తెర!

రాజ్యాంగంపై చర్చకు ప్రభుత్వం, ప్రతిపక్షాలు అంగీకారం

న్యూఢిల్లీ: పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఉభయ సభల్లోనూ ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ఏర్ప డిన ప్రతిష్టంభనకు తెరపడింది. భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ ఆమోదించి 75 సంవత్సరాలు అవుతున్న తరుణంలో లోక్‌సభలో, రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ జరిపేందుకు ప్రభుత్వం, ప్రతిప క్షాలు సోమవారం ఓ అంగీకారానికి వచ్చాయి. పార్లమెంటరీ వ్యవహా రాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ, రాజ్యాంగంపై లోక్ సభలో ఈ నెల 13, 14 తేదీ ల్లోనూ, రాజ్యసభలో ఈ నెల 16, 17 తేదీల్లోనూ చర్చించేందుకు అంగీకారం కుదిరిందని చెప్పారు. పార్లమెంటు కార్యకలాపాలు మంగ ళవారం నుంచి సజావుగా జరిగేం దుకు అన్ని పార్టీలు అంగీకరించా యన్నారు. గౌతమ్ అదానీపై అమె రికాలో కేసు, సంభల్ హింసా కాండ, మణిపూర్ అల్లర్లపై చర్చకు ప్రతిపక్షాలు పట్టుబడుతుండటంతో పార్లమెంట్‌లో ప్రతిష్టంభన నెల కొన్న సంగతి తెలిసిందే.

బాధ్యతలు తీసుకొనే రోజే బలి

రోడ్డు ప్రమాదంలో యువ ఐపీఎస్ దుర్మరణం

బెంగళూరు: ఇటీవలే శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరడానికి వెళ్తున్న ఓ యువ ఐపీఎస్ అధికారిని రోడ్డు ప్రమాదం బలి తీసుకుంది. కర్ణాటక హసన్ జిల్లాలో ఆదివారం ఈ విషాదం చోటు చేసుకుంది. పోలీస్ వాహనం టైర్ పగిలి డ్రైవర్ నియంత్ర తణ కోల్పోవడంతో ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. వాహనం రోడ్డు పక్కన ఉన్న ఒక చెట్టును, ఇంటిని ఢీ కొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న కర్ణాటక క్యాడర్ 2023 బ్యాచ్ ఐపీఎస్ అధి కారి హర్ష్ బర్ధన్(26) తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన దవాఖా నలో చికిత్స పొందుతూ మరణిం చారు. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. హోలెనరసిపూర్ ఏఎస్పీగా ఆదివారం బాధ్యతలు స్వీక రించడం కోసం బర్ధన్ హసన్ వెళు తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.

53 లక్షల కోట్ల ఆయుధాల అమ్మకం!

వ్యాపారుల పంట పండించిన ఉక్రెయిన్, గాజా యుద్ధాలు

న్యూఢిల్లీ: ఆసియా ఖండంలో ఉద్రిక్తతలు, ఉక్రెయిన్, గాజాలో యుద్ధాలు ఆయుధ వ్యాపారుల పంట పండించాయి. ఈ సాయుధ ఘర్షణల నేపథ్యంలో పశ్చిమా సియా, రష్యాలోని ఆయుధ ఉత్పత్తిదా రులు భారీగా లాభాలు ఆర్జించారని ఓ నివేదిక పేర్కొంది. గత ఏడాది ప్రపంచం లోని 100 భారీ ఆయుధ కంపెనీలు సుమారు రూ.53 లక్షల కోట్ల (632 బిలియన్లు) విలువైన ఆయుధాలను విక్రయించాయని స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రిసెర్చ్ ఇన్‌స్టి ట్యూట్ (సిప్రీ) వెల్లడించింది. రెండేండ్ల క్రితం (2022) ఒక్కసారిగా డిమాండ్ పెరిగిన ప్పటికీ దానిని అందుకోవడంలో ఆయుధ కంపెనీలు విఫలమవడంతో వాటి ఆదాయం తగ్గిందని, అయితే గత ఏడాది ఉత్పత్తిని పెంచడం ద్వారా లాభాలు అందుకున్నాయని ఆ నివేదిక వివరించింది. ఈ వంద భారీ ఆయుధ కంపెనీల చరిత్రలోనే మొదటిసారిగా అవి గత ఏడాది రూ.8,470 కోట్ల మేరకు అధిక అమ్మకాలు చేశాయని ఆ నివేదిక తెలి పింది. ఈ ఏడాదితోపాటు వచ్చే ఏడాది కూడా డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నదని భావిస్తున్న ఆయుధ కంపెనీలు సిబ్బందిని భర్తీ చేసుకొనే ప్రక్రియను మరింత వేగ వంతం చేశాయని సిప్రీ సంస్థకు చెందిన పరిశోధకుడు లొరెన్జో స్కరాజాటో తెలిపారు. గాజా, ఉక్రెయిన్ యుద్ధ అవసరాలను తీర్చడంలో చిన్న ఆయుధ కంపెనీలు ప్రభావ వంతంగా పనిచేశాయని పేర్కొన్నారు.

'ఉక్రెయిన్‌కు అణ్వాయుధాలను ఇవ్వం'

వాషింగ్టన్: రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం తీవ్రమవుతున్న నేపథ్యంలో ఉక్రె యిన్‌కు అణ్వాయుధాలను ఇవ్వబోమని అమెరికా తేల్చిచెప్పింది. సోవియట్ యూనియన్ పతనానంతరం ఉక్రెయిన్ వదులుకున్న అణ్వాయుధాలను తిరిగి ఇచ్చే ప్రసక్తే లేదని 'వైట్ హౌస్' స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్ష పదవి నుంచి దిగిపోయే ముందు ఉక్రెయిన్‌కు అణ్వాయు ధాలు ఇవ్వాలని కొందరు అధికారులు బైడె న్‌కు సూచించినట్టు వచ్చిన వార్తా కథనంపై 'వైట్ హౌస్' జాతీయ భద్రతా సలహాదారు ఈ ప్రకటన చేశారు.

మరుగుదొడ్లు శుభ్రం చేయండి

- సిక్కుమత నిబంధనలు ఉల్లంఘించిన సుఖ్‌బీర్‌కు అకాల్ తఖ్త్ జతేదార్ శిక్ష

న్యూఢిల్లీ: సిక్కు మత కోడ్‌ను ఉల్లంఘించినందుకు గాను శిరోమణి అకాలీ దళ్(ఎస్ఏడీ) మాజీ చీఫ్ సుఖ్ బీర్‌సింగ్ బాదల్ మరుగుదొడ్డి శుభ్రం చేయాలని ఐదుగురు సిక్కు మతాధికారులతో కూడిన అకాల్ తఖ్త్ జతేదార్ సోమవారం ఆదేశాలు జారీచేసింది. సుఖ్‌బీర్‌సింగ్ సిక్కుమత నిబంధనలను (తంఖైయా) ఉల్లంఘించినట్టు తేలడంతో ఈ మేరకు శిక్ష విధిం చింది. బాదల్, ఆయన సహచరులు గంటపాటు బాత్రూం శుభ్రం చేయాలని, అలాగే గురుద్వారలోని వంటశాలలో గంటపాటు పాత్రలు శుభ్రం చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో సుఖ్‌బీర్‌సింగ్ బాదల్ సహా కోర్ కమిటీ సభ్యులు, 2015 నాటి ప్రభుత్వంలో క్యాబినెట్ సభ్యులుగా ఉన్నవారు డిసెంబర్ 3న మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు బాత్రూంలను శుభ్రం చేస్తారు. ఆ తర్వాత స్నానాలు చేసి వంటశాలలో భోజనం వడ్డిస్తారు. అనంతరం శ్రీ సుఖ్‌మణిని పఠి స్తారు. పంజాబ్‌లో ఎస్ఏడీ అధికారంలో ఉన్న సమయంలో సుఖ్‌బీర్‌సింగ్ మతపరమైన తప్పిదాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2007-17 మధ్య మతపరమైన తప్పుడు నిర్ణయాలను తీసుకున్నారని సుఖ్‌బీర్‌ను అకాల్ తఖ్త్ దోషిగా నిర్ధారించింది. ఈ నేపథ్యంలో తాజాగా శిక్ష విధించింది.